క్లుప్తంగా

నేడు దేవనర్తకి నాటక ప్రదర్శన

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లె బైపాస్ రోడ్డులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి 8 గంటలకు 'దేవనర్తకి' నాటక ప్రదర్శన జరుగనుంది. శ్రీకృష్ణ రాయబారం నుంచి పడక సీన్ వరకు హాస్యభరిత నాటక ప్రదర్శన ఉంటుందని ప్రజలు పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రేపు చలో కాశినాయన జ్యోతి క్షేత్రం

ప్రొద్దుటూరు : ఇటీవల అటవీశాఖ అధికారులు కాశినాయన జ్యోతి క్షేత్రంలో భక్తుల వసతి భవనాలను కూల్చివేతను వ్యతిరేకిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఆదివారం చలో కాశినాయన జ్యోతి క్షేత్రం నిర్వహిస్తున్నామని రెడ్డి సంఘాల ప్రతినిధి బైరెడ్డి అంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయాలకు అతీతంగా రెడ్డి సంఘాల ప్రతినిధులందరూ జ్యోతి క్షేత్రానికి తరలిరావాలని కోరారు.

పార్వతీదేవికి పూజలు



ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ఉన్న పార్వతీదేవికి పాల్గొన మాసం సందర్భంగా శుక్రవారం అర్చకుడు వెంకటాచలపతి ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే మల్లె, జాజి, కనకాంబరం పూలు, నిమ్మకాయలు వేసి అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా చండీ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో శుక్రవారం పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గోపూజ, గణపతి, నవగ్రహ, ఉపదేవతా హోమం, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజా ద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఆలయ కమిటీ సభ్యులు, వేదపాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వరశర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హోలీ



రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో హోలీ వేడుకలను శుక్రవారం ప్రజలు ఉత్సాహంగా జరుపుకోన్నారు. చిన్నా పెద్దా అంతా హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యువకులు, చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు, రంగు నీళ్లు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

నివాళి



నరసింహారెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ దంపతులు


పోరుమామిళ్ల: మాజీ మార్కెటింగ్ చైర్మన్ రమణారెడ్డి మామ చిన్నపరెడ్డి నరసింహారెడ్డి శుక్రవారం నరసింగుపల్లెలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఆయన సతీమణి తులశమ్మ నరసింగుపల్లె వెళ్లి నరసింహారెడ్డి భౌతిక దేహానికి నివాళి అర్పించారు. బద్వేలు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కలసపాడు జెడ్పీటీసీ గురివిరెడ్డి, కాశినాయన మండల కన్వీనర్ హనుమంతారెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీకి నివాళి

దువ్వూరు : మండలంలోని చిన్నసింగనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ నారుపల్లె గంగమ్మ(100) గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు మాజీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నారుపల్లె చక్రధర్‌రెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభం రెడ్డి, అఖిల భారత రెడ్డి సంఘం నాయకుడు నారుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కులు లేవు.. ఆహ్లాదం కరువు

- కిలోమీటర్ల మేర విస్తరిస్తున్న బద్వేలు
- వందల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్న రెవెన్యూ డివిజన్
- లక్షకు పైగా జనాభా
- కానీ ఆహ్లాదం కోసం ఒక్క పార్కు లేదు
- భూ కబ్జాలతో పట్టణమంతా గందరగోళం



బద్వేలు పట్టణం (ఏరియల్ వ్యూ)



కబ్జాకు గురైన యన్‌జీఓ కాలనీలో 965 సర్వే నంబర్‌లోని పార్కు స్థలం

బద్వేలు : వజ్రోత్సవం కిందట 1951న ఏర్పడ్డ అసెంబ్లీ నియోజకవర్గం.. రెండు దశాబ్దాల కిందట (2006) మున్సిపాలిటీగా ఆవిర్భవించిన పట్టణం.. 2020న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనుమతితో రెవెన్యూ డివిజన్‌గా అవతరించిన ప్రాంతం.. నడిబొడ్డు నుంచి నలువైపులా కిలోమీటర్ల కొద్దీ విస్తరిస్తూ.. వందల ఎకరాల ప్రభుత్వ భూములు.. లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణం బద్వేలు. ఇంత చరిత్ర ఉన్న బద్వేలు పట్టణంలో సాంత్వన చేకూర్చుకునేందుకు, ఆహ్లాదకరంగా గడిపేందుకు నేటికీ ఒక్కటంటే ఒక్క పార్కు లేదు. పార్కులకు స్థలాలు కేటాయించినా.. వాటి నిర్మాణం చేపట్టక పోవడంతో కబ్జాదారులు ఆక్రమించేశారు. దీంతో పట్టణంలో సాయంత్ర సమయంలో సేద తీరేందుకు ఎక్కడా చోటు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం వాకింగ్ ట్రాక్‌లు సైతం లేకపోవడంతో రోడ్ల పైనే నడవాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రభుత్వంపై విమర్శలు

మేజర్ పంచాయతీగా ఉన్న బద్వేలు పట్టణం 2006లో మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. బద్వేలు పురపాలక సంఘం పరిధిలో 35 వార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 24 వేలకు పైగా గృహాలు ఉండగా, లక్షకు పైగా జనాభా నివసిస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలం కిందటనే కుంటలో ప్రభుత్వ ఆసుపత్రి పక్కన పార్కు కోసం ఎకరం స్థలం కేయించినట్లు తెలుస్తోంది. 50 ఎకరాల్లో విస్తరించి ఉన్న యన్‌జీఓ కాలనీలో నాలుగు చోట్ల ప్రభుత్వ స్థలం పార్కుకు కేటాయించినట్లు సమాచారం. తెలుగు గంగ కాలనీ క్వార్టర్ల సమీపంలో ప్రభుత్వ స్థలాలు 20 ఎకరాలకు పైగా నిరుపయోగంగా ఉన్నాయి. అది కూడా చాలా వరకు కబ్జాదారుల చేతుల్లో ఉన్నట్లు భోగట్టా. శ్రీక్రిష్ణదేవరాయనగర్, శివరామ క్రిష్ణయ్య నగర్, సందరయ్య కాలనీ, మహ్మద్‌నగర్, తెలుగుగంగ కాలనీ, గాంధీనగర్ చుట్టు పక్కల వందల ఎకరాల్లో కాలనీలు ప్రభుత్వ స్థలాల్లోనే వెలిశాయి. అందులో కొందరికి ప్రభుత్వం ప్లాట్లు ఇవ్వగా.. కొందరు దురాక్రమణ చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. గాంధీనగర్‌లో కొందరు దారులను కూడా ఆక్రమించుకుని ఇళ్లు కట్టుకున్నారు. ఈ కాలనీల్లో ఎక్కడా ఒక సెంటు భూమి కూడా పార్కులకు కేటాయించలేదు. ఎన్‌జీఓ కాలనీలో పార్కుకు కేటాయించిన స్థలాన్ని దురాక్రమణ చేసినట్లు తెలుస్తోంది. పార్కుకు కేటాయించిన స్థలానికి కూతవేటు దూరంలో మున్సిపల్ కార్యాలయం ఉంది. అయినా పార్కు స్థలం కబ్జా చేశారంటే.. ఇది ప్రభుత్వ చేతకానితనంగా ప్రజల్లో విమర్శలు ఉన్నాయి.

పార్కు నిర్మాణానికి కేటాయించిన స్థలాలు

బద్వేలు పట్టణంలో దాదాపు రెండు దశాబ్దాల కిందట వివిధ చోట్ల పార్కుల నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఎన్‌జీఓ కాలనీలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఉన్న పెద్దరోడ్డులో మడకలవారిపల్లె పంచాయతీలో సర్వే నంబర్ 956లో 0.94 సెంట్లు, అదే రోడ్డులో సర్వే నంబర్ 965లో 0.45 సెంట్లు, సర్వే నంబర్ 953లో 0.60 సెంట్లు, 0.40 సెంట్లు, 12 సెంట్లు, అలాగే పాత బద్వేలు పట్టణంలో కోట వీధిలో సర్వే నంబర్ 1180లో (పాత ప్రభుత్వ ఆసుపత్రి స్థలం) 1.5 ఎకరాల భూమిని పార్కుల నిర్మాణం కోసం కేటాయించారు. అందులో సర్వే నంబర్ 965లో 0.40 సెంట్ల స్థలంలో 0.8 సెంట్లు కబ్జాకు గురైంది. సర్వే నంబర్ 953లో 0.12 సెంట్లు కబ్జా చేశారు. అయినా అధికారులు పట్టించుకోక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్వాధీనం చేసుకుంటాం



కమిషనర్ నరసింహారెడ్డి

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిని వివరణ కోరగా.. సర్వే నంబర్ 965లో కబ్జాకు గురైన 0.8 సెంట్ల స్థలం కోర్టులో స్టేటస్కోలో ఉంది. సర్వే నంబర్ 953లో 12 సెంట్లు ఆక్రమణకు గురైంది. కబ్జాదారులకు నోటీసులు పంపించారు. త్వరలో మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. అంతే కానీ పార్కుల నిర్మాణం చేపడతామన్న మాట మున్సిపల్ కమిషనర్ నోట రాకపోవడం గమనార్హం.

రేపు ఈఏపీ సెట్, నీట్ నమూనా పరీక్షలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సృజన్స్ కోచింగ్ సెంటర్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఉచితంగా ఈఏపీ సెట్, నీట్ నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సృజన్స్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు సునీల్ బాబు, సృజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2వేలు, ద్వితీయ స్థానం నిలిచిన వారికి రూ.1000 నగదు బహుమతులు అందిస్తామని వారు పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8099919877 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ర్యాలీ జయప్రదం చేయండి

పోరుమామిళ్ల: కడపలో ఆదివారం నిర్వహిస్తున్న మాజీ సైనికుల మహార్యాలీ జయప్రదం చేయాలని పోరుమామిళ్ల మాజీ సైనికుల అసోసియేషన్ పిలుపిచ్చింది. శుక్రవారం అసోసియేషన్ ఇచ్చిన ప్రకటనలో మాజీ సైనికులకు, వీరపత్నులకు పెన్షన్, వైద్యం, కొత్త సైనికుల ఉద్యోగ అవకాశాలు, భూమి సమస్యలపై జిల్లా పరిషత్ సమావేశ హాలులో జరిగే సమావేశంలో చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ప్లాస్టిక్‌ను అరికడదాం

చాపాడు: ప్లాస్టిక్‌ను అరికడదామని ఈఓపీఆర్డీ రాధా కృష్ణవేణి పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన చాపాడులో స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖలకు అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆణిముత్యాలు అమలయ్యేనా ?

- గతేడాది టెన్త్ టాపర్లకు రూ.లక్ష నగదు బహుమతి
- ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగుస్తున్నా అందని వైనం



గతేడాది టాపర్‌లకు నగదు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ విజయరామరాజు (ఫైల్)

కాశినాయన : ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులను ప్రోత్సహించి మిగిలిన విద్యార్థుల్లో స్ఫూర్తినింపేందుకు గత ప్రభుత్వం పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన వారికి 'ఆణిముత్యాలు' పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు స్పష్టం చేసింది. దీంతో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించారు. నగదు ప్రోత్సాహకాలు అందుతాయని భావించారు. పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి గ్రూపులో టాపర్‌లను ఎంపిక చేసి ప్రోత్సాహకాలు అందించారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులను పాఠశాలల్లో ఉపాధ్యాయులను, ప్రిన్సిపాల్‌లను, నగదు ప్రోత్సాహం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులను కూడా గత ప్రభుత్వం సత్కరించి గౌరవించింది.

టాపర్‌లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ వివిధ గ్రూపుల్లో చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని ఎంపిక చేసి టాపర్‌లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు అందజేశారు. నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

ఈ ఏడాది సందిగ్ధం

ఆణిముత్యాలు పథకానికి గతేడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుండి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. గతేడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిలలో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమం పూర్తి చేశారు. అయితే ఈ ఏడాది విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఇంత వరకు ఆణిముత్యాలుపై ఎటువంటి మార్గదర్శకాలు అందలేదు. నగదు పురస్కారాలు అందుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయం నుండి కూడా ప్రకటన వెలువడలేదు. జిల్లా విద్యాశాఖాధికారులకు కూడా మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా లేదా అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతుంది.

వైభవంగా కోట పోలేరమ్మ జాతర



ప్రత్యేక అలంకారంలో కోట పోలేరమ్మ

పోరుమామిళ్ల: పట్టణంలోని రంపాడురోడ్‌లో వెలసిన శ్రీ పోతురాజు, చౌడేశ్వరీ సహిత కోట పోలేరమ్మ జాతర శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. శుక్రవారం పౌర్ణమి కావడంతో తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకాలు, పూజాకార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో కాయకర్పూరం, పసుపు, కుంకుమలతో అమ్మవారిని దర్శించుకొని, పూజలు చేశారు.

కనుల పండువగా పౌర్ణమి వేడుకలు



శ్రీకృష్ణ, బలరామ విగ్రహాలకు పుష్పాలతో అభిషేకం చేస్తున్న ఇస్కాన్ బృందం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో శుక్రవారం రాత్రి ఇస్కాన్ ఆధ్వర్యంలో గౌర పౌర్ణమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. శ్రీకృష్ణ, బలరామ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరించారు. ఇస్కాన్ గురువు శ్రీల భక్తి ప్రేమ స్వామి మహరాజ్ మాట్లాడుతూ భగవద్గీత చవడం వల్ల మంచి చెడుల విచక్షణ జ్ఞానం తెలుస్తుందని తెలిపారు. భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. శ్రీకృష్ణ, బలరామ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం, ఏనుగుల సెట్టింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు.

ఘనంగా ప్రారంభమైన ఉరుసు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మజార్

దువ్వూరు : మండలంలోని కృష్ణంపల్లె గ్రామంలో వెలసిన హజరత్ జమాల్ వలి స్వామి 142వ ఉరుసు మహోత్సవం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం దర్గా ధర్మకర్తలు, ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఉరుసు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు దర్గా ధర్మకర్త వెన్నపూస పుల్లారెడ్డి ఇంటి నుంచి మేళ తాళాలతో పక్కీర్ల విన్యాసాలతో గంధాన్ని ఊరేగిస్తూ దర్గాకు తీసుకొచ్చారు. దర్గాలోని స్వామి మజార్‌కు గంధం సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. శనివారం ఉరుసు రోజున ఉదయం 8 గంటల నుంచి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గరుడ వాహనంపై శ్రీనివాసుడు



గరుడ వాహనంపై శ్రీనివాసుడు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ లక్ష్మీపాలెం గ్రామంలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం గరుడ వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి స్వామివారికి మోహినీదేవి అలంకారంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం హంస వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ రామలింగారెడ్డి, అర్చకుడు శ్రావణ్ పాల్గొన్నారు.

కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలు దుర్మార్గం



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

అట్లూరు: అవదూత కాశిరెడ్డి నాయన జ్యోతి క్షేత్రంలోని అన్నదాన ఆశ్రమాలను అక్కడ ఉన్న కట్టడాలను కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాంద్‌బాషా, రమణ్య పేర్కొన్నారు. అట్లూరులోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ కాశిరెడ్డి నాయన క్షేత్రంలో ప్రతి రోజూ వేలాది మంది భక్తులతో పాటు నిరాశ్రయులకు కూడా భోజన వసతి కల్పిస్తున్న అన్నదాన సత్రాల కూల్చివేత అందరినీ దిగ్భ్రాంతి గురిచేసిందన్నారు. కూల్చివేతలకు పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రవిచంద్రా, అట్లూరు గోపయ్య, జి.గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : కాశినాయన ఆశ్రమంలో అటవీశాఖ అనుమతులు లేవంటూ కూల్చివేసిన కట్టడాలను తిరిగి పునర్నిస్తామని నియోజకవర్గ టీడీపీ నాయకులు రితీష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాశినాయన ఆశ్రమంలో అటవీశాఖ అనుమతులు లేవని నిలిపివేసిన కట్టడాలకు త్వరలో కేంద్ర అటవీశాఖ అనుమతులు వస్తాయని, ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం అండగా ఉండి నిర్మాణాలను పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

ప్రొద్దుటూరు క్రైం : కిడ్నీ సమస్యతో బాధపడుతున్న బైక్ ఎలక్ట్రీషియన్ మహమూద్ రఫికి ప్రొద్దుటూరు టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక సాయం అందజేసింది. మహమూద్ రఫి కొన్ని రోజుల నుంచి కిడ్నీలో రాళ్ల సమస్యతో బాధపడుతున్నాడు. అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మహమ్మద్ రఫికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక ఆయం అందజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అయూబ్ హుస్సేన్, వైస్ ప్రెసిడెంట్ గాలి శివ, సెక్రటరీ రమణ, రామచంద్ర పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం

కమలాపురం : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేసే ముస్లింలకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు పుణ్యకార్యం అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ మంత్రి అంజద్‌బాషా, నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం పెద్ద దర్గాలో వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ ఇచ్చిన ఇఫ్తార్ విందుకు వారు హాజరయ్యారు. దర్గా మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి డిమాండ్ చేశారు. కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మెరుగైన పీఆర్సీ, మధ్యంతర భృతిని ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు. అలాగే పెండింగ్ బకాయిలన్నింటినీ చెల్లిస్తామని, డీఏలను సకాలంలో ప్రకటిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ముంచిన శనగ



కొర్రపాడులో దెబ్బతిన్న శనగ పంట

ఆరుగాలం శ్రమించినా అన్నదానకు కష్టం తప్పా ఫలితం దక్కలేదు. వేలాది రూపాయలు ఖర్చు పెట్టి పంటను సాగుచేసినా దిగుబడి రాలేదు. ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పంట నూర్పిడి అనంతరం కొర్ర, శనగ, నువ్వు, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మండలంలోని కొర్రపాడు గ్రామంలో రైతు బాబా బుడేషా సాహెబ్ ఐదు ఎకరాల్లో శనగ పంటను సాగు చేశారు. పంట సాగులో విత్తనాలతో పాటు ఎరువులను వేశారు. అనంతరం పురుగు మందుల పిచికారీతో పాటు నీటితడులు అందించారు. అయితే పంట ఏపుగా పెరగక పోవడంతో తెలుసుకున్న రైతు చేసేదేమిలేక పంటను వదిలేసుకోవాల్సి వచ్చింది. ఎకరాకు రూ.16 వేలు చొప్పున రూ.80 వేలు ఖర్చు చేశాడు. చివరకు ఆ పంటను ట్రాక్టర్‌తో దున్నివేయడంతో రైతు పంటకు పెట్టిన పెట్టుబడి నేలపాలైంది.

– రాజుపాళెం



ట్రాక్టరుతో శనగ పంటను దున్నుతున్న రైతు

నిబంధనలతో మాకేం పని?

నిబంధనలతో మాకేం పని.. మాది ఇష్టా రాజ్యం.. తోచిన చోట లే అవుట్ వేస్తాం.. అమ్ముకుంటాం.. అంటున్నారు అక్రమార్కులు. పంట పొలాలను కమర్షియల్ అవసరాలకు అమ్మేస్తున్నారు. దీనికి అవసరమైన ప్రక్రియలేవీ చేయడం లేదు. చెరువులను చెరపట్టి లే అవుట్ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- పుట్టగొడుగుల్లా లే అవుట్లు
- ఎలాంటి అనుమతులు లేకుంటానే చకచకా నిర్మాణ పనులు
- చోద్యం చూస్తున్న అధికారులు



నిర్మాణాలు చేపడుతున్న రియల్టర్లు

చాపాడు: మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని చాపాడు మండలం పల్లవోలు, ఖాదర్‌పల్లె గ్రామాల పరిసరాల్లో అక్రమ లే అవుట్‌లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా వెంచర్లు వేసి విక్రయాలు జరుపుతుండగా.. పది రోజులుగా రెండు చెరువుల సమీపంలోనే నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్ వేసి, అక్రమంగా ప్రహరీని నిర్మిస్తున్నారు. ప్రతి రోజూ రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖా అధికారులు ఈ దారిలో వెళుతున్నప్పటికీ అక్రమ లే అవుట్ నిర్మాణాలు కన్పిస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

యథేచ్ఛగా విక్రయాలు

మండల పరిధిలోని పల్లవోలు, ఖాదర్‌పల్లె అనుబంధ చెరువులకు 50 మీటర్ల దూరంలో ఎలాంటి అనుమతులు లేకుండా లే అవుట్ వేసి నిర్మాణాలు చేపట్టారు. చెరువుల పక్కనే ఉన్న సర్వే నంబరు 217–1లో 0.89 ఎకరాలు, 217–2లో 0.88 ఎకరాల పట్టా భూమిలో లే అవుట్ వేస్తున్నారు. ఇప్పటికే దీని చుట్టూ అక్రమంగా బౌండరీస్ ఏర్పాటు చేసి ప్రహరీ నిర్మిస్తున్నారు. అంతే కాకుండా దీని పక్కనే చెరువుల నుంచి నీటిని పంట పొలాలకు అందించే అలవంకను సైతం అక్రమంచి అందులోని మట్టిని లే అవుట్‌ల నిర్మాణాలకు వినియోగిస్తున్నారు. ప్రొద్దుటూరుకు చెందిన ఓ రియల్టర్ నిబంధనలను ఉల్లఘించి యథేచ్ఛగా లే అవుట్ వేసి విక్రయాలు జరుపుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలే లేదు.

రెవెన్యూ అధికారులు ఏమన్నారంటే..

అక్రమ లే అవుట్ నిర్మాణాలపై వీఆర్‌ఓ ఇస్మాయిల్ వివరణ కోరగా.. ఈ విషయాన్ని మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. ఇదే క్రమంలో డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డిని వివరణ కోరగా.. అక్రమ లే అవుట్‌పై చర్యలు తీసుకుంటామని, తహసీల్దారుతో చర్చించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.